సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం 24 ఏప్రిల్ 2024



వనమంతా జనజాతర

సలేశ్వరం లింగమయ్య దర్శనానికి రెండో రోజు మంగళవారం భక్తజనం పోటెత్తారు.

వివరాలు 8లో ▸



భారీగా నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

42.4 /23.1

వాతావరణం

ఉదయం, మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉన్నా ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

న్యాయమూర్తుల బదిలీలు

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మహబూబ్‌నగర్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా పని చేస్తున్న ఎం.సంధ్యారాణి మేడ్చల్ కోర్టుకు బదిలీ అయ్యారు. అలాగే రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న డి.ఇందిరను నాగర్‌కర్నూల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. గద్వాల జిల్లా కోర్టులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న జి.ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు.

సమాజ మార్పులో పుస్తకాలదే కీలకపాత్ర



స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ మార్పులో ప్రముఖ పాత్ర పోషించేవి పుస్తకాలేనని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగం కుమారస్వామి అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని లుంబిని పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజ ప్రగతికి తగిన స్ఫూర్తిని నింపి, ప్రేరణ ఇచ్చేది పుస్తకమే అన్నారు. పుస్తకాలు చదివిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తుందన్నారు. పలు సామాజిక రుగ్మతలను నిర్మూలించే సాధనం పుస్తకం అని అభిప్రాయపడ్డారు. ప్రముఖ గాయని పద్మావతి కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన సుమారు 40 మంది కవులు పుస్తక గొప్పతనాన్ని వివరిస్తూ తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా మైనొద్దీన్, కొప్పోలు యాదయ్య, ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జీవవైవిధ్యాన్ని కాపాడటం అందరి బాధ్యత అని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీయూ ఆడిటోరియంలో వృక్షశాస్త్రం ఆధ్వర్యంలో 'జీవవైవిధ్య సంరక్షణలో నూతన పోకడలు- సుస్థిరాభివృద్ధి' అంశంపై ఏర్పాటు చేసిన నేషనల్ సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వాతావరణంలో అస్థిరత ఏర్పడినప్పుడు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడతాయని, ఫలితంగా అనేక అనర్థాలు సంభవిస్తాయని, దానిని ప్రతిఒక్కరు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ అధ్యాపకురాలు శైలజ మాట్లాడుతూ అంతరించి పోతున్న జీవ జాతులను కాపాడాలని, అంతరించి పోతున్న జంతు, వృక్ష జాతులను వాటికి అనుకూలమైన ప్రదేశాలకు తరలించినప్పుడు మాత్రమే వాటిని కాపాడడం సాధ్యవుతుందన్నారు. ఎక్కడైతే సమృద్ధిగా వృక్ష, జంతు జాతులు ఉంటాయో ఆ ప్రదేశాలను హాట్‌స్పాట్‌గా ప్రకటించాలని, 1970 నుంచి 2014 మధ్యలో విపరీతమైన జనాభా పెరుగుదల కారణంగా జీవ వైవిధ్యంలో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయన్నారు. వృక్ష, జంతు జాతులను భవిష్యత్ తరాలకు అందించాలంటే విత్తన బ్యాంకులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల్లో వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జీవవైవిధ్యం దెబ్బతినడానికి మానవ తప్పిదాలే కారణమని, వాటిని నియంత్రించాలని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ పుష్పలత, ఈసీ మెంబర్స్ నూర్జహాన్, కిషోర్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కృష్ణయ్య, శివకుమార్‌సింగ్, రాణెమ్మ, వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

సోనామసూరి ధర రూ.2,459

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,459, కనిష్ఠంగా రూ.1,900 ధరలు నమోదయ్యాయి. మార్కెట్‌కు దాదాపు 3వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ఇదిలా ఉండగా.. దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు ఉల్లిపాయల వేలం జరుగుతుంది. గడిచిన రెండు వారాలుగా మార్కెట్‌కు సెలవు కారణంగా ఉల్లి వేలం జరగలేదు. దీంతో చాలామంది రైతులు నేరుగా ఉల్లిని విక్రయించుకున్నారు. మూడు వారాల తర్వాత జరుగుతున్న వేలం కావడంతో ఉల్లి వ్యాపారం జోరుగా సాగే అవకాశం ఉంది.



బిజినేపల్లిలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. వేదికపై ఎంపీ అభ్యర్థి మల్లురవి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

పాలమూరు అభివృద్ధే లక్ష్యం

రాజకీయాలకతీతంగా బంగారు నేల చేసుకుందాం

- ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత నాది
- కొడంగల్ ఆత్మగౌరవం ఢిల్లీలో నిలబెట్టండి
- బిజినేపల్లి, మద్దూరు సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి/మద్దూరు/ కోస్గి: 'నేను పాలమూరు బిడ్డను.. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని కొండారెడ్డిపల్లిలో పుట్టిన రైతు బిడ్డను.. మీ సోదరుడిగా.. మీ బిడ్డగా ఇక్కడికి వచ్చాను. పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయడమే నా జీవిత లక్ష్యం. ఇక్కడి నేలను బంగారు మయం చేస్తా. పచ్చని పంటలు, పరిశ్రమలతో దేశంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతా. 60 ఏళ్ల తర్వాత మీ బిడ్డకు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చింది. ఆగం కావొద్దు.. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి ఒక్కటి అవుదాం.. పాలమూరును అభివృద్ధి చేసేందుకు సహకరించండి.' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వందరోజుల్లోనే 6 గ్యారంటీల్లో 5 అమలు చేస్తుంటే వాటిపై బీజేపీ, బీఆర్‌ఎస్ దుమ్మెత్తి పోస్తున్నారని, ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి పదవి ఒక్కసారి వచ్చింది.. మళ్లీ ఆ పదవి రావడానికి 70 ఏళ్లు పట్టిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో జన జాతర బహిరంగ సభ, నారాయణపేట జిల్లా మద్దూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్లయినా పాలమూరు- రంగారెడ్డి, భీమా, కోయిల్‌సాగర్, సంగంబండ ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. తాను ముఖ్యమంత్రి అయిన మూడు నెల్లలోనే సంగంబండకు రూ.10 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, త్వరలోనే 25 వేల ఎకరాలకు నీళ్లు రానున్నాయన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు అయినా సరే పూర్తి చేసే బాధ్యత తమదని చెప్పారు.



కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో బావాజీని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

■ ఉమ్మడి జిల్లా నుంచి దేశానికి ఆదర్శంగా నిలిచిన బూర్గుల రామకృష్ణారావు, జైపాల్‌రెడ్డి లాంటి వారు ఈ ప్రాంతం వారని, తర్వాత తనకు సీఎంగా అవకాశం ఇచ్చిందన్నారు. 2014 నుంచి ఈ ప్రాంతానికి మంత్రి పదవులు, నిధులు ఇవ్వడంలో, అభివృద్ధిలో అన్యాయం జరిగిందన్నారు. 2009లో అలంపూర్ నిండా మునిగిపోతే తన బంగ్లా అమ్మి అయినా ఆదుకుంటానన్న కేసీఆర్ వారిని పరామర్శించడానికి కూడా రాలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగడిలా ఉందని, తుమ్మిళ్ల ప్రాజెక్టు దుమ్ము కొట్టుకుపోయేలా కేసీఆర్ చేశారన్నారు. సోనియాగాంధీ అండతో నన్ను ముఖ్యమంత్రి కుర్చీలో తెలంగాణ ప్రజలు కూర్చోబెట్టారన్నారు. గద్వాలలోనే 7వేల ఓట్లతో డిపాజిట్ గల్లంతైన డీకే అరుణను, బీజేపీని ఏం అడుగుతామన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గౌరవించాం.. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నిరుద్యోగులు, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడి ప్రజల కోసం ఇంకా కొట్లాడాలని కోరుకున్నామన్నారు. కేసీఆర్ గడీలను బద్దలు కొడతానని చెప్పిన కేసీఆర్ ఈ రోజు అదే గడీల్లో బందీ అయ్యారని దుయ్యబట్టారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న సంపత్‌కుమార్ అసెంబ్లీలో బిల్లు పెట్టాలని పోరాడితే.. ఆ రోజు కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని ఒక పోలీస్ అధికారిగా ఉండి ఈడ్చుకెళ్లావ్ అని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పని చేసిన కేసీఆర్ పంచన ఎలా చేరావని నిలదీశారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు పది ఎంపీలను ఇస్తే మోదీకి మద్దతు ఇచ్చారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వేసే ఓటు తిరిగి కేసీఆర్‌కే వేసినట్టు అవుతుందని, కేసీఆర్ ఆ ఓటును బీజేపీకి అమ్ముకుంటాడన్నారు. తుమ్మిళ్ల ప్రాజెక్టును సంపత్‌కుమార్ ఆధ్వర్యంలోనే పూర్తి చేస్తామని, అంతేకాక ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసుకోవాలంటే, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి జిల్లాను ఆగం చేయకండని అభ్యర్థించారు. మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌ను, నాగర్‌కర్నూల్‌లో మల్లురవిని గెలిపిస్తే ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తారన్నారు.

■ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు సమస్యలపై పోరాటం చేస్తూ పార్లమెంటులో ఈ ప్రాంతం గొంతుకలా పని చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, హన్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఆత్మగౌరవం దెబ్బతీసే కుట్రలు

ప్రతిపక్షాలు రేవంత్‌రెడ్డి ఆత్మగౌరవం దెబ్బ తీసే కుట్రలు చేస్తున్నాయని మరోమారు కొడంగల్ ప్రజలు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే సమయం వచ్చిందని సీఎం అన్నారు. తాను చేస్తున్న ప్రజా పాలనను జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిపెట్టి ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం నామినేషన్ వేసి వెళ్లిన నన్ను మీ భుజస్కంధాలపై పెట్టుకొని ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. సోనియమ్మ దయతో ముఖ్యమంత్రి అయ్యాను. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకుంటున్న కుట్ర రాజకీయాల నుంచి కొడంగల్ ప్రజలు ఆత్మగౌరవాన్ని కాపాడాలనే లక్ష్యంలో ఐదోసారి ప్రచారానికి రావాల్సి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి మాట మేరకు ఉమ్మడి పాలమూరు ప్రజలు 14కు 12 అసెంబ్లీ స్థానాలను గెలిపించి కాంగ్రెస్ అండగా ఉన్నారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అండగా నిలబడాలని కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను తాను దూషించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ముఖ్యమంత్రిగా ఉన్న నాకు ఆమెతో ఎలాంటి పంచాయితీలు ఉంటాయో ప్రజలే ఆలోచించాలన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మొండితనం.. నడిగడ్డ నేలలోనే ఉంది



సభావేదికపై ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తదితరులు

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- మచ్చలేని ఐపీఎస్‌గా పనిచేసిన ఆర్‌ఎస్‌పీని ఎంపీగా గెలిపించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- అలంపూర్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం
- ముందుగా జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంపూర్: నడిగడ్డ నేలలోనే మొండితనం ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా కేటీఆర్ హెలీకాప్టర్‌లో అలంపూర్ ఆలయాలకు చేరుకొని.. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరులో 14 సీట్లు ఉంటే అందులో నడిగడ్డలోని రెండు సీట్లు గెలిచామని.. ఈ రోజు ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని కేసీఆర్ ద్వారా పదవులు పొందిన పెద్ద నాయకులు ఒక్కొక్కరుగా జారుకుంటున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, రాజ్యసభ సభ్యులు వంటి పదవులు పొందిన వారు పార్టీ కష్టకాలంలో జారుకుంటుంటే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లోకి వచ్చారన్నారు. అధికార పార్టీ ఎన్నో రకాలుగా ప్రలోభాలకు గురిచేసినా.. వాటికి లొంగలేదని చెప్పారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్‌గా మచ్చలేని జీవితం గడిపారన్నారు. పిల్లలు చదువుకుంటే ఆ కుటుంబం బాగుపడతాది అని కేసీఆర్ వెయ్యి గురుకుల పాఠశాలలు పెడితే వాటిని సమర్థవంతంగా నడిపి లక్షలాది మంది పిల్లలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన వ్యక్తి అన్నారు. అధికారిగా ఉండి అంత సేవ చేస్తే రేపు మీరు ఓట్లు వేసి గెలిపించి ఎంపీగా చేస్తే ఢిల్లీ వేదికగా అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అభ్యర్థిగా ఖరారు చేసిన రోజే ఎంపీగా గెలుస్తారనే టాక్ వచ్చిందన్నారు. ఉమ్మడి పాలమూరులోని ఏ నియోజకవర్గానికి లేని అదృష్టం అలంపూర్‌కు ఉందని, ఒకవైపు శాసనమండలిలో గొంతు విప్పి మాట్లాడటానికి చల్లా వెంకట్రామిరెడ్డి.. మరోవైపు శాసనసభలో పోరాటం చేయడానికి తమ్ముడు విజయుడు ఉన్నారన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంపీగా గెలిస్తే మూడోవైపు పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలపై మాట్లాడే అవకాశం దక్కుతుందన్నారు. పక్కనున్న వనపర్తిలో నిరంజన్‌రెడ్డి దురదృష్టవశాత్తు ఓడిపోవడంతో అక్కడ ఎమ్మెల్యే.. ఎమ్మెల్సీ ఇద్దరూ లేరన్నారు.

మరోసారి మోసపోవద్దు..

రాష్ట్రంలోని పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవాలని కేటీఆర్ అన్నారు. ఒకసారి మోసం చేస్తే మోసం చేసినవాడిదని, రెండోసారి మోసపోతే ఆ తప్పు మనదే అవుతుందన్నారు. పార్లమెంట్ స్థానంలో పోటీ పడుతున్న ముగ్గురు అభ్యర్థుల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్ కంటే మెరుగైన అభ్యర్థి ఉన్నారా అని ప్రశ్నించారు. రేపటి రోజు మా అభ్యర్థి అని గర్వంగా చెప్పుకొనే అవకాశం ఉందని, వేరే వాళ్లకు ఆ అవకాశం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సంచులు మోయడానికి కాంగ్రెస్ అభ్యర్థి పనికి వస్తాడేమో కానీ.. ఢిల్లీలో ప్రజల కష్టాలు చెప్పడానికి పనికి రాడన్నారు. పాలమూరు అంటేనే వలస జిల్లాగా ఉండేదని కేసీఆర్ పాలనలో ఇతర రాష్ట్రాల వాళ్లు ఇక్కడికి బతుకుదెరువుకు వచ్చారన్నారు. కేసీఆర్ ఉన్న పదేళ్లు నీళ్లకు, కరెంట్‌కు బాధ లేదన్నారు. ఈసారి మన ప్రభుత్వం వచ్చి ఉంటే ఆర్డీఎస్, నెట్టెంపాడు పూర్తి చేసి రోడ్లు, కొన్ని విద్యాలయాలు తెచ్చుకునే వారమన్నారు. కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లో ప్రజలు కోపంగా ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 30 వేల ఉద్యోగాలు ఇస్తే ఈరోజు రేవంత్‌రెడ్డి నేనిచ్చానని చెప్పుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

■ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కష్టకాలం వచ్చిందన్నారు. నా రాజకీయ జీవితంలో నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో విజయుడిని గెలిపించారని, ఈసారి ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

■ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజల పరిస్థితి దీనంగా మారిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

■ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే వస్తున్నానని, పదవుల కోసం కాదన్నారు. నన్ను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతంలోని ప్రతి ఒక్కరు పార్లమెంట్‌లో ఉన్నట్లేనని, నిరంతరం ప్రజల మధ్య ఉండి సేవ చేస్తానన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ మహా శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక రామమందిరం నుంచి మేళతాళాలతో స్వామివారి శోభాయాత్ర క్లాక్‌టవర్, అశోక్ టాకీస్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు ఊరేగింపు సాగింది. అనంతరం హనుమంతుడి విగ్రహానికి పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, హిందువాహిని తదితర ధార్మిక సంస్థల నేతలు, కార్యకర్తలు కాషాయ ధ్వజాలను చేతబూని ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే శోభాయాత్రలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. హనుమంతుడి విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర ఊరేగింపు

'కేసీఆర్ పర్యటనను విజయవంతం చేద్దాం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం సాయంత్రం జిల్లాకేంద్రానికి రానున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రం న్యూటౌన్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలో రోడ్‌షోతోపాటు క్లాక్‌టవర్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. వందరోజుల్లో హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పి మాట తప్పారని ఆరోపించారు. దీంతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని, అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వడంతోపాటు తప్పుడు ప్రచారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. అన్నివర్గాల వారు రాష్ట్ర ప్రభుత్వంపై కోపంతో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీఎస్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, నాయకులు రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతినెలా పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణం జరిపిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించి.. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం పెట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్ఛరణాలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమం జరిపించారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పలు పూజలు చేశారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.

ఐదోరోజు నామినేషన్ల జోరు

- పాలమూరులో 6, నాగర్‌కర్నూల్‌లో 10 దాఖలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల గడువు దగ్గర పడుతుండటంతో నామినేషన్ల దాఖలు జోరందుకుంటోంది. ఈ క్రమంలో మంగళవారం ఐదోరోజు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆరుగురు అభ్యర్థులు 7 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌కు అందజేశారు. ఇందులో ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా జి.రాకేశ్, బీఎంపీ అభ్యర్థిగా అనీసుర్ రహమాన్, స్వతంత్ర అభ్యర్థులుగా మల్లెల హరిందర్‌రెడ్డి, టి.విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమేశ్, కారుకొండ శ్రీనివాసులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే మరో లోక్‌సభ స్థానమైన నాగర్‌కర్నూల్‌లోనూ 10 నామినేషన్లు వచ్చాయని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లు రవి, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫారమ్స్ పార్టీ (ఆధార్ పార్టీ) అభ్యర్థిగా అంబోజు రవి తరఫున దయాకర్, చిరుతైగల్ కచ్చి పార్టీ అభ్యర్థిగా భారతి దాసరి, స్వతంత్ర అభ్యర్థులుగా గాలిముడి గీత, పిల్లెల శ్రీకాంత్, నేడిగొండ కృష్ణయ్య, పాలాది నాగరాజు, కర్నె శిరీష (బర్రెలక్క), లంద భిక్షపతి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.



నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అభ్యర్థి మల్లురవి

క్లుప్తంగా

చెరువులో పడి ఉపాధికూలీ మృతి



రాజాపూర్: గుండ్లపొట్లపల్లికి చెందిన ఉపాధికూలీ కుచ్చర్‌కంటి లింగమ్మ(49) మంగళవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందారు. ఉదయం గ్రామ శివారులో చేపట్టిన ఒండ్రు మట్టి తరలింపు ఉపాధి పనుల్లో పాల్గొని తోటి కూలీలతో కలిసి తిరిగి వస్తుండగా... దారిలో ఉన్న చెరువుగుంటలో కాళ్లుచేతులు కడిగేందుకు వెళ్లిన సమయంలో లింగమ్మ ప్రమాదానికి గురయ్యారు. నీటిలో జారిపడి మునిగిపోయారు. కాగా వెంటనే అప్రమత్తమైన తోటికూలీలు గుంటలోకి దిగి లింగమ్మను బయటకు తీసుకువచ్చారు. 108లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఏపీడీ పరామర్శ

లింగమ్మ మృతివిషయం తెలుసుకున్న ఏపీడీ శ్రీపాద్ జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా వచ్చే సహాయం త్వరగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

తెలకపల్లి: ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గట్టురావిపాకులకి చెందిన పార్వతమ్మ(42)తో ఇటీవల తన మరిది పరశురాములు, మరో సంఘటనలో పక్కింటి మహిళ ఆమెతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతమ్మ ఈ నెల 22న ఇంటి ముందున్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు. మృతురాలికి భర్త, పిల్లలు ఎవరూ లేరని తెలిపారు. మృతురాలి తల్లి చుట్టబక్కమ్మ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలియజేశారు.

ఊయలగా కట్టిన చీర ఉరితాడైంది

- ప్రమాదవశాత్తు గొంతుకు చుట్టుకోవడంతో మహిళ మృతి

మల్దకల్: కుమార్తె సరదాగా ఇంట్లో చీర కట్టుకొని ఊయల ఊగుతుండగా.. ప్రమాదవశాత్తు అదే చీర గొంతుకు చుట్టుకోవడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం మల్దకల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హేమలత (33), భర్త పరుశ రాముడు మల్దకల్‌లో పండ్ల జ్యూస్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా రోజు లాగే వ్యాపారం ముగించుకొని హేమలత సోమవారం ఇంటికి వెళ్లింది. అప్పటికే చీర కట్టుకొని కుమార్తె ఊయల ఊగుతోంది. ఈ క్రమంలోనే హేమలత ఇంట్లోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఊయలగా కట్టిన చీర గొంతుకు చుట్టుకోవడంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను చంపిన భర్తకు జైలుశిక్ష జరిమానా

నర్వ: మండలంలోని కొత్తపల్లికి చెందిన మేకల సురేఖను భర్త మేకల రాజు 9 ఏళ్ల కిందట హత్య చేయడంతో నేరస్తుడిపై న్యాయ విచారణ చేపట్టిన న్యాయమూర్తి మహ్మద్‌రఫీ నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లికి చెందిన మేకల సురేఖను ఊట్కూర్ మండలం చిన్నపొర్లకి చెందిన మేకల బాలప్ప కుమారుడు మేకల రాజుకు 2015 మార్చి 3న ఇచ్చి వివాహం చేశారు. మేకల రాజును ఇల్లరికం అల్లుడిగా చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత అల్లుడు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. 2015 నవంబర్ 11న సురేఖ పొలంలో కూలీ పనులకు వెళ్లి.. రాత్రి తిరిగి ఇంటికి వచ్చింది. ఆమె నిద్రలో ఉండగా... భర్త కిరోసిన్ పోసి నిప్పంటించాడు. పూర్తిగా కాలిన ఆమె 45 రోజుల పాటు చికిత్స పొందుతూ.. మృతిచెందింది. ఈ సంఘటనపై అప్పటి ఎస్‌ఐ నర్సింహులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి 22 మంది సాక్షులను ప్రవేశపెట్టగా.. మంగళవారం నారాయణపేట జిల్లా జడ్జి మహ్మద్‌అబ్దుల్ రఫీ తీర్పును వెలువరించారు. భార్యను చంపిన భర్త మేకల రాజుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారని తెలియజేశారు. ఈ కేసును పరిశోధించిన అప్పటి ఎస్‌ఐ నర్సింహులు, సీఐ రాజేందర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను అభినందించారు.

టీటీసీ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గత ఫిబ్రవరిలో నిర్వహించిన టీటీసీ (టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్) ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిందని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫలితాలను చూసుకోవాలని సూచించారు.

వనమంతా జనజాతర

- సలేశ్వర క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన నల్లమల అభయారణ్యం
- నిబంధనలు సడలించి 24 గంటలు అనుమతించిన అటవీ శాఖ


అచ్చంపేట/మన్ననూర్: చైత్రశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం సలేశ్వరం లింగమయ్య దర్శనానికి భక్తజనం పోటెత్తారు. మండుటెండలు.. రాళ్ల రప్పలు.. చెట్లు చేమల్ని లెక్క చేయకుండా కర్రల సాయంతో సాహసయాత్ర చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో నల్లమల అభయారణ్యం సందడిగా మారింది. లింగమయ్య నామస్మరణతో మార్మోగింది. ముందుగా ప్రకటించిన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఉన్న అనుమతి నిబంధనలను అటవీ శాఖ సడలించింది. 24 గంటలపాటు భక్తులను అనుమతించారు. సోమవారం రాత్రి నుంచే భక్తులు తరలిరావడంతో నల్లమల దారులన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రమాదకర కొండలు, లోయలను దాటి.. లింగమయ్యను దర్శించుకున్నారు. ముందుగా గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దారి పొడవునా ఉన్న శివలింగాలతో పాటు నాగుల పుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. కొండలపై నుంచి జాలువారుతున్న నీటి పరవళ్లతో భక్తులు పరవశించిపోయారు. ప్రమాదకర ప్రదేశాల్లో వలంటీర్లతో పాటు పోలీసులు భక్తులకు రక్షణగా నిలిచారు. పోలీసు బందోబస్తును డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు రవీందర్, శంకర్‌నాయక్ పర్యవేక్షించారు. ఫర్హాబాద్ నుంచి పుల్లాయిపల్లిపెంట వరకు వాహనాలు బారులు తీరాయి. లింగాల మండలం అప్పాయిపల్లి–గిరిజన గుండాల దారి సైతం రద్దీగా మారింది. రెండో రోజు మంగళవారం 60వేల మంది లింగమయ్యను దర్శించుకున్నారు. చివరి రోజు బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ఆర్టీసీ బస్సులను అచ్చంపేట నుంచి సాయంత్రం 4 గంటలకు నిలిపివేస్తున్నట్లు డీఎం తెలిపారు.

టోల్ చార్జీలతో బెంబేలు..

సలేశ్వరం ఉత్సవాలకు వెళ్లే వాహనదారుల నుంచి భారీగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఫర్హాబాద్, అప్పాయిపల్లి మార్గంలో టోల్ వసూలుకు రెండు కౌంటర్లు ఏర్పాటుచేశారు. బస్సులు, పెద్ద వాహనాలకు రూ.1000, కారు, జీపులకు రూ.500, ఆటోలకు రూ.300, ద్విచక్ర వాహనాలకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. గతేడాది కూడా ఇవే చార్జీలు నిర్ణయించగా.. అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రూ.1000 నుంచి రూ.500లకు, రూ.100 నుంచి రూ.50లకు కుదించారు. ఈసారి మళ్లీ చార్జీలు పెంచి, వసూలు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.



సలేశ్వరం లింగమయ్య దర్శనానికి తరలివెళ్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సలేశ్వరం లింగమయ్య



కర్ర సాయంతో వెళ్తున్న భక్తులు



సలేశ్వరం కొండల్లో భక్తుల సందడి



యాత్రికుల జేబులకు చిల్లు..

సలేశ్వరం యాత్రికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఆర్టీసీ, ఆటో, జీపుల చార్జీలు మొదలుకొని, పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెంచి అమ్ముతున్నారు. ఈఏడాది అచ్చంపేట నుంచి పుల్లాయిపల్లి పెంట వరకు మాత్రమే ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. యాత్రికుల నుంచి ఆర్టీసీ బస్సు చార్జీ రూ.160 వసూలు చేస్తుండగా.. పుల్లాయిపల్లిపెంట నుంచి మొకాళ్ల కురవ వరకు ఆటో, జీపులకు మరో రూ.50 చెల్లించాల్సి వస్తోంది. ఇది వరకు రాంపూర్ వరకు రూ.150 చార్జీతో యాత్రికులు వెళ్లేవారు. ఈసారి రూ.210 చార్జీలు చెల్లించాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. అదేవిధంగా టెంకాయ ధర రూ.100, లీటరు వాటర్ బాటిల్ రూ.50లకు విక్రయిస్తున్నారు. లడ్డూ ధర రూ.100గా నిర్ణయించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన తాగునీటి వసతి కేంద్రాలు భక్తులను ఆదుకుంటున్నాయి. ధరలు నియంత్రించడంలో అధికారులు ఎవరూ చొరవ చూపడంలేదు.



గుండం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం

మిడ్జిల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంవీఎస్ గార్డెన్‌లో మంగళవారం మిడ్జిల్, ఊర్కొండ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ప్రజలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 26న మహబూబ్‌నగర్‌లో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పాండు, వీరారెడ్డి, ఎంపీపీలు సుదర్శన్, రాధ జంగయ్య, జెడ్పీటీసీ శశిరేఖ, బాల్‌రెడ్డి, శ్రీనివాసులు,, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

దళితుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: దళిత వాడాల్లో కష్టాలు తీరాలంటే మరోసారి మోదీని గెలిపించుకోవాల్సిన అవసరం.. అవశ్యకత ఎంతైనా ఉందని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎస్సీ మోర్చా ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. దళితుల చిరకాల కల ఎస్సీ వర్గీకరణకు మోదీ గ్యారంటీ ఇచ్చారని గుర్తు చేశారు. మోదీ గ్యారంటీ అంటే తిరుగులేని గ్యారంటీ అని దళితులు అందరూ విశ్వసించిన కేంద్రంలో మోదీని, మహబూబ్‌నగర్‌లో అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎస్సీ సామాజిక వర్గాల అభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యవుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం మోదీ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. దళిత విద్యార్థులు అందరితో సమానంగా విదేశాలకు వెళ్లేందుకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారన్నారు. 60 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా దళితులను పట్టించుకున్న పాపన పోలేదన్నారు. మహబూబ్‌నగర్‌లో బీజేపీ గెలుపు కోసం ఎస్సీ మోర్చా నేతలు అందరూ బాధ్యతగా పని చేసి.. ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలన్నారు. అనంతరం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ దళితుల స్థితిగతులు మారుతున్నాయి అంటే అది మోదీ పాలనతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, కృష్ణయ్య, భరత్ భూషణ్, సాయిరాం, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

కాంగ్రెస్‌లో చేరిన ఆర్‌ఎస్పీ సోదరుడు

సీఎం సమక్షంలో చేరిక



ప్రసన్నకుమార్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

అలంపూర్: బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రసన్నకుమార్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీఎం పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఈయన స్వయాన తమ్ముడు కావడం విశేషం. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఇటీవలే ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అన్న బీఎస్పీ వీడిన తర్వాత అనూహ్యంగా తమ్ముడు కాంగ్రెస్‌లో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అన్న బీఎస్పీలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నుంచి ప్రసన్న కుమార్ పోటీ చేశారు. ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాలతో అన్నదమ్ములు ఇద్దరు వేర్వేరు పార్టీలో చేరిపోయారు. అన్నకు వెన్నంటి ఉండే ప్రసన్న కుమార్ ఆయన బాటలోనే బీఆర్‌ఎస్‌లో చేరతారని అందరూ భావించారు. కానీ అందుకు భిన్నంగా కొన్ని రోజులుగా ప్రసన్న కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే జోరు ప్రచారం సాగింది. చివరకు అనూహ్యంగా కాంగ్రెస్ గూటికి వెళ్లారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి 2009లో ప్రసన్న కుమార్ టీడీపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అన్న ప్రవీణ్ కుమార్ బీఎస్పీలో రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండటంతో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా అలంపూర్ నుంచే బరిలో నిలిచి ఓటమి చెందారు. ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న ప్రసన్న కుమార్ ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. అన్నదమ్ములు వేర్వేరు బలమైన పార్టీలో ఉండటంతో రాబోయే ఎన్నికల ప్రచారంలో విమర్శలు ఏ స్థాయిలో ఉంటాయనే ఆసక్తి నెలకొంది.

చల్లా తరఫున బీఫాం స్వీకరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి చల్లా అశ్లేషారెడ్డి మంగళవారం పార్టీ బీఫాం అందుకున్నారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేష్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి బీఫాం అందజేశారు.

సెలవులొచ్చేశాయ్

- నేటినుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలను పదిరోజుల క్రితం ప్రారంభమై సోమవారంతో పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి విద్యార్థుల మార్కుల వివరాలను పాఠశాలల హెచ్ఎంలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం వారికి మధ్యాహ్నంలోగా విద్యార్థుల ఉత్తీర్ణత మార్కులు, ప్రోగ్రెస్ కార్డులు అందించారు. పాఠశాలలు తిరిగి జూన్ 11 వరకు సెలవులు ఉండగా 12 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. దీంతో హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల విద్యార్థులు ఇంటి బాటపట్టారు. ఈ విషయమై డీఈఓ రవీందర్ స్పందిస్తూ పాఠశాలలకు పూర్తిస్థాయిలో సెలవులు ప్రకటించామని, విద్యార్థులు ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బయటకు వెళ్లకుండా ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

మిడ్జిల్: మండలంలోని ఆర్‌ఎంపీ రమేష్ క్లినిక్‌ను అధికారులు సీజ్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే ఆడపిల్ల అని తేలడంతో వేములకి చెందిన జయలక్ష్మికి మహబూబ్‌నగర్‌లో అబార్షన్ చేయగా ఆమె మృతి చెందింది. ఘటనపై జిల్లా వైద్యాధికారి కృష్ణ విచారణ చేయగా జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉన్న వరలక్ష్మి ఆమెకు అబార్షన్ చేయడంతో మృతి చెందినట్లు తెలిసింది. కాగా వరలక్ష్మిని మంగళవారం విచారించగా మిడ్జిల్‌కు చెందిన ఆర్‌ఎంపీ రమేష్ రెఫర్ చేసినట్లు తెలిపింది. దీంతో అతడి క్లినిక్‌ను సీజ్ చేసినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు.

ఏఎన్‌ఎంకు నోటీసులు

పాలమూరు: జయలక్ష్మి అబార్షన్ వ్యవహారంలో అధికారులు చర్యలు చేపట్టారు. అబార్షన్ చేసిన ఏఎన్‌ఎం వరలక్ష్మిని గుర్తించారు. భాగ్యనగర్ కాలనీలో ఆమె నిర్వహిస్తున్న క్లినిక్‌కు మంగళవారం జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు సీజ్ చేసి నోటీసులు అందించారు. నోటీస్‌లపై సరైన సమాధానం రాకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. వరలక్ష్మి 22 ఏళ్ల కిందట ఏఎన్‌ఎం కోర్సు చేసి కొన్ని రోజుల పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నర్స్‌గా పని చేసిందన్నారు. తర్వాత పోతులమడుగులో క్లినిక్ నడిపి అక్కడి నుంచి వచ్చి ప్రస్తుతం భాగ్యనగర్ కాలనీలో ప్రత్యేక క్లినిక్ నడుపుతోందన్నారు. క్లినిక్ నడపటానికి అనుమతితో పాటు అర్హత లేకపోయినా దర్జాగా చికిత్సలు అందిస్తోందని తెలిసింది.

'బీఆర్‌ఎస్‌కు రెండు సీట్లకు మించిరావు'



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: ఆగస్టు 15లోపు రుణ మాఫీ చేయకుంటే రాజీనామా చేస్తావా అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారని, బీఆర్‌ఎస్ రెండు సీట్లకు మించి గెలవకుంటే హరీశ్‌రావు రాజీనామా చేస్తాడా అని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రతిసవాల్ విసిరారు. మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి సంబంధించి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎంపీ అభ్యర్థి మల్లురవితో కలిసి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు మెజార్టీ కోసమేనని, మల్లురవి గెలుపుపై ఎలాంటి అనుమానాలు లేవని అన్నారు. శాసనసభ ఎన్నికల కంటే మెరుగైన మెజార్టీ తీసుకురావడమే లక్ష్యమని అన్నారు. సోనియా గాంధీ హయాంలో తెలంగాణ కళను సాకారం చేయడం జరిగిందని, ప్రస్తుతం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసి రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను పది సంవత్సరాల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పెండింగ్‌లోని ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో పది శాతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేకపోయారని, కృష్ణానది నుంచి తీసుకోవాల్సిన నీటిపై శ్రద్ధపెట్టలేదని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీలు గెలుపు కోసం కాకుండా కేవలం అస్తిత్వం కోసం మాత్రమే పోటీ పడుతున్నాయని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటే 11 గ్యారంటీలు అమలు అవుతాయని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కవల పిల్లలాంటి వారిని, ఒకరిని గద్దె దించామని, ఇంకొకరిని గద్దె దించుతామని అన్నారు. బీజేపీ ఐటీ, ఈడీ, సీబీఐలను ప్రయోగించి ప్రతిపక్షాలను బెదిరించాలని అనుకుంటున్నాయని అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ రావాలన్నారు.

బీజేపీకి అండగా నిలుద్దాం

మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కల్వకుర్తిరూరల్: ఎస్సీలను ఏ, బీ, సీ, డీ లుగా వర్గీకరించాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి అండగా నిలిచి ఆ పార్టీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపిద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తిలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనకు పదవులపై మమకారం లేదన్నారు. మాదిగజాతి అభ్యున్నతే ధ్యేయమన్నారు. వర్గీకరణతో భవిష్యత్ తరాల వరకు జాతి ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అదేవిధంగా భారత రాష్ట్ర సమితికి మాదిగలు మద్దతు ఇవ్వద్దన్నారు. ఎంపీ రాములు, అభ్యర్థి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. నాయకులు శేఖర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రామస్వామి, బండల రామచంద్రారెడ్డి, మబ్బుసాయన్న మాదిగ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రూ. 8.14 లక్షలు స్వాధీనం

కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్తకోట పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. మంగళవారం వాహనాల తనిఖీలో భాగంగా పట్టణంలోని కర్నూల్ రోడ్డులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. పట్టణ కేంద్రానికి చెందిన రాములు స్కూటీలో రూ.4.50 లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఉండవెల్లిలో రూ.3,64,430 నగదు..

ఉండవెల్లి: రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద ఎలాంటి పత్రాలు లేని నగదు రూ.3,64,430ను పట్టుకుని గ్రీవెన్స్ కార్యాలయానికి తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం ఎండీ మోసీన్ రూ.1,30,000 నగదును, వెంకటేశ్వర్లు రూ.1,00,930 నగదు, ఖాజాబాషా రూ.68,500 నగదును, కృష్ణ చైతన్య రెడ్డి రూ.65 వేల నగదును చెక్‌పోస్టు అధికారులు పట్టుకున్నారని తెలిపారు.

మద్యం పట్టివేత....: ఉండవెల్లి నుంచి కంచుపాడుకి అక్రమంగా మద్యాన్ని తరలి స్తున్న తెలుగు నరసింహులును అదుపులోకి తీసుకుని 10.320 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహులు కర్నూల్ జిల్లా ఈ.తాండ్రపాడుకు చెందిన వ్యక్తి కావడంతో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం విలువ రూ.11,790 విలువ ఉంటుందని అంచనా వేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్‌కేంద్రాలను మంగళవారం కమిషనర్ ఎస్.రాజయ్య, మేనేజర్ నరేష్‌తో కలిసి పరిశీలించారు. మే 13న పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ఉండటంతో పోలింగ్ కేంద్రాల్లోని వసతులను ఆయన పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నిక జరిగినందున పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేస్తామన్నారు. కేంద్రాల్లో వసతుల కల్పనపై సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



నవాబుపేట: వృద్ధులంతా ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని స్వీప్ సంస్థ నోడల్ అధికారి శ్రీధర్‌సుమన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఓటు హక్కు అవగాహన సదస్సులో ప్రసంగించారు. ప్రభుత్వం వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించేలా చేస్తున్న కార్యక్రమంలో అందరు పాల్గొనాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మండల అధ్యక్షుడు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, వేణునాథం, పండరీనాథ్, అనంతయ్య, చిన్నస్వామి, హన్మయ్య, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



హన్వాడ: పులే, అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలని దండోర నాయకులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 28న జిల్లాకేంద్రంలో నిర్వహించే జాతరకు బహుజనులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జంబులయ్య, కిరణ్, యాదయ్య, బాలకృష్ణ, నాగయ్య, రాంచందర్, రాములు, వెంకట్, శ్రీనివాసులు, అంజన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



బాలానగర్: ఉడిత్యాలలో ఓ వెంచర్ యాజమాన్యం ప్రభుత్వ భూమిని ఆక్రమించడంపై గ్రామస్తుల ఫిర్యాదుతో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఇన్‌చార్జ్ ఆర్‌ఐ రామ్మోహన్, సర్వేయర్‌లతో హద్దులు ఏర్పాటు చేయించారు. భూమిని ఆక్రమించి రోడ్డు వేయడం వాస్తవమేనన్నారు. సర్వేయర్ ఫైనల్ మ్యాప్ అందజేసిన తర్వాత నోటీసులు ఇస్తామన్నారు. కాగా వెంచర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎన్నికల్లో సత్తా చాటుతాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుతామని స్వతంత్ర అభ్యర్థి హన్మేష్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం రిటర్నింగ్ అధికారి రవి నాయక్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. కృష్ణ ముదిరాజ్, రాఘవేంద్ర, పవన్, నరేష్, విజయ్, శివన్న, బాలచందర్, తిమ్మప్ప, అనంతరెడ్డి, నీలకంఠరావు, దేవన్ననాయక్ పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు అవసరం

జడ్చర్ల టౌన్: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని డా. బీఆర్ఆర్ ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఆంగ్లభాష దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఆంగ్లవిభాగ అధిపతి డా.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

బాలానగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అగ్రిమెంట్ ప్రకారం సంఖ్య లేకుండానే కార్మికులకు పేరుతో జీతాలను ఏజెన్సీ కాంట్రాక్టర్ దోచుకుంటున్నాడని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. మంగళవారం బాలానగర్‌లో మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. జీవో నంబర్60 వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీ అక్రమాలపై చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి



అమిస్తాపూర్‌లో శోభాయాత్ర



చిన్నచింతకుంటలో ..

సాక్షినెట్‌వర్క్: జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయుడికి అభిషేక పూజలు, అలంకరణ పూజలు చేశారు. పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు.

■ నవాబుపేట మండల పరిధిలోని కొల్లూర్, యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, మరికల్, పోమాల్, లోకిరేవు, బంగ్రాంపల్లి, రుద్రారం, చాకలపల్లి, నీర్‌సాబ్‌తండా తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ జడ్చర్ల మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. పాతబజార్ హనుమాన్ దేవాలయంలో తెల్లవారుజామున 4గంటల నుంచి పూజలు ప్రారంభం అయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆకుపూజలు జరిపించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర అలరించింది. నాగసాల ఆంజనేయస్వామి ఆలయంలో సీఐ ఆదిరెడ్డి పూజలు చేసి శోబాయాత్రను ప్రారంభించారు. ఊరేగింపు పురస్కరించుకుని జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు మిన్నంటాయి.

■ అడ్డాకుల, మూసాపేట మండలాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు. పోల్కంపల్లిలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పూజలు చేశారు.

■ చిన్నచింతకుంట పరిధిలో అన్ని గ్రామాల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

■ గండేడ్, మహమ్మదాబాద్ పరిధిలో వేడుకల్లో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ దేవరకద్ర పరిధిలో యువకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.

■ భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

■ హన్వాడ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలకు పూజలు చేశారు. వంశీ చంద్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



జిల్లాకేంద్రంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు



జడ్చర్లలో హనుమాన్‌శోభాయాత్ర



దేవరకద్రలో..

అనన్యరెడ్డికి సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: సివిల్స్‌లో మూడోర్యాంకు సాధించిన అనన్యరెడ్డిని మంగళవారం ఆమె స్వగృహంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీవీపీ రాష్ట్ర ప్రతినిధులు జి.పాండురంగం కేవీఎస్ఆర్.ప్రసాద్, నరేంద్రక్రిష్ణ, రమేష్‌చందర్, భూషణ్‌పాండే, వీఎస్ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, యతిరాజాచారి, వెంకటేశ్వరగుప్త, జయప్రకాశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ యోగా, కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే వేసవి కరాటే శిక్షణ శిబిరం పోస్టర్లను ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ ఫౌండర్ కోటకదిరె వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 28న నుంచి జూన్ 11 వరకు 45 రోజులపాటు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, ఎస్.వినోద్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ విభాగం చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలి

నవాబుపేట: మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీగా రెండోసారి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీ నివాసంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానికుడిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో జరిగే కేసీఆర్ రోడ్‌షో విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడల్ పరీక్ష విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఈఏపీసెట్, నీట్ మోడల్ పరీక్షను విజయవంతం చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు పరీక్షకు పోస్టర్‌ను నాయకులు మంగళవారం విడుదల చేశారు. మరింత సమాచారం కోసం సంప్రదించాలన్నారు.

ప్రజాపాలనను విస్మరించారు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ పార్లమెంట్ ప్రచార కార్యదర్శి కె.సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం గాజులపేటలో తమ ఎంపీ అభ్యర్థి తరుపున ఎన్నికలకు సంబంధించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎం.మునయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

25న సదస్సు

మహబూబ్‌నగర్ రూరల్: పులే- అంబేడ్కర్ జయంతుల సందర్భంగా రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే అంశంపై ఈనెల 25న జిల్లా సదస్సు ఉంటుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ వి.కురుమూర్తి, డీపీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుశీల తదితరులు

రాజాపూర్: గ్రామాల్లో తాగునీరు, తదితర సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని మండల ఎంపీపీ సుశీల మంగళవారం ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సూచించారు. కాగా ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. ముఖ్యంగ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్ సమస్యలు ఉన్నాయని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుద్ధ్యం విషయంలోనూ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఇక ముందైనా నిర్లక్ష్యం వీడి ఆస్పత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని మండల వైద్యాధికారి మధుసూదన్‌రామ్‌కు తెలిపారు. తహసీల్దార్ విద్యాధర్‌రెడ్డి, ఎంపీడీఓ మచ్చేందర్, ఏపీఓ వెంకట్‌రాములు, జెడ్పీటీసీ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘వంశీ’ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పార్లమెంట్ ఎన్నికల్లో చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపును ఎవరు అడ్డుకోలేరని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పోల్కంపల్లిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ జెడ్పీటీసీలు రామన్‌గౌడ్, బాలనర్సిములు తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: గూడూర్‌లో నాయకులు శేఖర్, కమలాకర్, ఖదీర్ తదితరులు ప్రచారం చేశారు.

నవాబుపేట: యన్మన్‌గండ్లకి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు దుశ్యంత్‌రెడ్డి, ఎంపీటీసీ తులసీరాంనాయక్ ఉన్నారు. గిరిజనులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని ఆదివాసి గిరిజన యాత్ర ఇన్‌చార్జ్ లింగంనాయక్, నీల్యానాయక్, తులసీరాంనాయక్, గోపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం నవాబుపేటలో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గోపాల్, నీల్యా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో కాంగ్రెస్ ప్రచారం జోరుగా సాగింది. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి చిన్నరాజమూర్‌లో పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం ప్రారంభించారు. మండల అధ్యక్షుడు అంజల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కౌకుంట్లలో మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి కిషన్‌రావు తదితరులు ప్రచారం చేశారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తోందని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీరభద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు జి.రవీందర్ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి

సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలి



చర్లపల్లి పాఠశాలలో పేరెంట్స్ టీచర్ మీట్‌లో పాల్గొన్న డీఈఓ రవీందర్



జిల్లా కేంద్రంలోని గ్రాడ్యుయేషన్ డే

జడ్చర్ల టౌన్: పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించినందున విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని.. జాగ్రత్తగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సూచించారు. మంగళవారం చర్లపల్లి, కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్ మీట్‌లో పాల్గొని మాట్లాడారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా.. అదవిధంగా ఈతకు వెళ్లే విషయంలో జాగ్రత్త అవసరమన్నారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు నియామకం అయి మౌళిక సదుపాయాలపై ప్రతిపాదనలు పూర్తి చేశామని.. త్వరలోనే పనులు మొదలయ్యేలా చూస్తామన్నారు. ఎంఈఓ మంజులాదేవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతప్ప, సీఎంఓ బాలుయాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు అంజమ్మ, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా రామస్వామిగుట్ట తండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో డీఈఓ రవీందర్ పాల్గొన్నారు. విద్యార్థులకు మెడల్స్ అందించారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాల, ఇప్పటూర్ పాఠశాలలో మంగళవారం గ్యాడ్యుయేట్ ఘనంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే..

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని వేపూరిగేరి, రామయ్యబౌలి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా చిన్నారులకు సర్టిఫికెట్స్ ఇచ్చారు.

జడ్చర్ల: బాదేపల్లి అంగన్‌వాడీ సెక్టార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు పలికి ప్రగతి పత్రాలను అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు

గండేడ్: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈఓ రాఘవేందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్లు , పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. అధిగమించేందుకు ఇప్పటి నుంచే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సమస్య రాకుండా స్థానిక వనరులను వాడుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. ఏవైనా పైపులైన్ల మరమ్మతు, లీకేజీల సమస్యలుంటే సత్వరమే పరిష్కరించి.. సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా భూగర్భజలాలు తగ్గుతున్న కారణంగా నూతన బోర్లు వేయకుండా ఉన్నవాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. చాలా గ్రామాల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉంటుందని అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో ప్రజలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ చెల్మారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ పాండు, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్దిలేటి, ఏపీఓ హర్శిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

‘నీళ్లు రాకుండా చేస్తున్నారు’

గండేడ్: మండల కేంద్రానికి చెందిన కొందరు తమకు నీళ్లు రాకుండా చేస్తున్నారంటూ జంగంరెడ్డి పల్లికి చెందిన పలువురు జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు, డీపీఓ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సమీక్షా సమావేశానికి వచ్చిన వారితో సమస్యపై మాజీ సర్పంచ్ హన్మంతుతో పాటు పలువురు లిఖిత పూర్వకంగా విన్నవించారు. మిషన్ భగీరథ పైపులైను కోసేశారని.. గేట్‌వాల్వ్ పిల్లరును కూడా ధ్వంసం చేశారన్నారు. అంతేకాకుండా గండేడ్‌లో ఏ షాపునకు వెళ్లినా సామగ్రి ఇవ్వడం లేదని, మెడికల్ షాపుల్లో మందులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన వారిని భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

అడ్డాకుల: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. నిజాలాపూర్ శివారులో నిర్మిస్తున్న ధ్యాన ధర్మ ఆశ్రమం, పిరమిడ్‌ను మంగళవారం మధ్యాహ్నం ఆయన సందర్శించారు. కొద్దిసేపు ధ్యానం చేశారు. పిరమిడ్‌ను నిర్మిస్తున్న రాము మాస్టర్‌ను ఆయన అభినందించారు. కామన్‌హాల్ నిర్మాణానికి ఇసుక కొరత తీర్చాలని రాము మాస్టర్ కోరారు. అదేవిధంగా నిజాలాపూర్ నుంచి చౌడాయపల్లికి బీటీరోడ్డు వేయించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శెట్టిశేఖర్, రామన్‌గౌడ్, బాలనర్సిములు, సీజీ.గోవర్ధన్, యాట సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, పల్లె రవి తదితరులు ఉన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ తోట పరిశీలన



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఏనుగొండ శివారులో రైతు తిరుపతిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.వేణుగోపాల్ పరిశీలించారు. ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. 8 నుంచి 10 లీటర్ల నీటిని ప్రతిరోజు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఏప్రిల్, మే మాసాల్లో మొక్కలు మొత్తం తడిచే విధంగా పిచికారీ చేయాలని అన్నారు.

అధ్యక్షుడిగా మల్లు దేవేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్ఎస్ మండల నూతన అధ్యక్షుడిగా కోటకదిర ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లు దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

అడ్డాకుల: మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త, జాతీయ నాయకుడు జె.బాలరాజు పిలుపునిచ్చారు. మూసాపేట మండల కేంద్రంలో మంగవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థులలు డీకే అరుణ, పి.భరత్‌ప్రసాద్‌కు మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. శ్రీరాములు, వెంకటేష్, కాన్షీరాం తదితరులు ఉన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



బాలానగర్: చెన్నంగులగడ్డ తండాలో ఆంజనేయస్వామి ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఆయాగ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

మహమ్మదాబాద్: కోడంగల్ మండలం ఉడుమేశ్వరంనకు చెందిన బాల బ్రహ్మచారి గండేడ్ మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఈ క్రమంలోనే ఆమెను కాదని మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై..

గండేడ్/మహమ్మదాబాద్: మంగంపేట్, గాధిర్యాల్ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా నంచర్ల గేటులో తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈ మేరకు స్టాటిక్ టీమ్ ఫిర్యాదుతో వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా ఉత్సవాలు

మహమ్మదాబాద్: నంచర్లలో వీరాంజనేయ పునః ప్రతిష్ఠ, బొడ్రాయిల ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మండపారాధన తదితర కార్యక్రమాలు చేపట్టారు.

రోడ్‌షో విజయవంతం చేయాలి

భూత్పూర్: మహబూబ్‌నగర్‌లో 26న నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని అన్నాసాగర్‌లో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

10శాతం ఇంక్రిమెంట్ సరికాదు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డికి ఏకంగా 10శాతం ఇంక్రిమెంట్ ఇవ్వడం సరికాదని పలు సంఘాల ఆధ్వర్యంలో పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. పలు అంశాలను ఆయనకు వివరించారు. విద్యార్థి నాయకులు రవీందర్, ఛత్రపతినాయక్, లాలూప్రసాద్, చందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా మాట్లాడితే కేసులు



రాజాపూర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని ఎవరైనా ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, ఇతర కార్యక్రమాలు చేపట్టినా నాన్‌బేయిలబుల్ కేసులు నమోదు చేస్తామని సీఐ నాగార్జునగౌడ్ హెచ్చరించారు. మంగళవారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చౌక్కంపేట్‌కి చెందిన నర్సిములు బాలానగర్‌లో గత 21న ప్రెస్‌మీట్‌పెట్టి ఇతర వ్యక్తులపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే కేసునమోదు చేసినట్లు వివరించారు. ఎస్ఐ రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టూ టౌన్ ఏఈ ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ 11 కేవీ మేయింటనెన్స్ పనుల కారణంగా సుభాష్ న గర్, పాల్‌సాబ్‌గుట్ట, రైల్వే స్టేషన్ ప్రాంతం, శెట్టికాంప్లెక్స్, రాజేంద్రనగర్, టీవీటవర్, స ద్దులగుండు, 40 ఇండ్ల ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల దాక విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.